సాక్షి వికారాబాద్

ఆదివారం । 10 । మార్చి । 2024



కరెంట్ బిల్లులు కట్టాల్సిందే..

ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పేదలకు 'గృహజ్యోతి పథకం'తో ఉచితంగా కరెంట్ ఇస్తామని చెప్పింది. 8లో▸



బీజేపీలో వర్గపోరు

బీజేపీలో వర్గపోరు బహిర్గతమైంది. నేతల మధ్య సమన్వయం లోపించి ఎవరికి వారు పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. 8లో▸



పట్టుదల ఉంటే..

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18న ప్రారంభం కానున్నాయి. ఇక మిగిలింది 8 రోజులే గడువే. 9లో▸



పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

రథోత్సవం



కల్యాణం చూతము రారండి!

శివరాత్రి పర్వదినం సందర్భంగా పలు ఆలయాల్లో పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని పులుసుమామిడిలోని గుట్టపై స్వామివారి కల్యాణం సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తుల రథోత్సవం కనుల పండువగా సాగింది. మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పరమేశ్వరుడి గుట్ట భక్తులతో కిటకిటలాడింది. పలువురు నేతలు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

– అనంతగిరి

న్యూస్‌రీల్

రేపటి నుంచి జైపూర్ కృత్రిమ కాళ్ల అమరిక

తాండూరు టౌన్: అఖిల భారతీయ మార్వాడీ యువమంచ్, రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రేపటి నుంచి ఉచిత జైపూర్ కృత్రిమ కాళ్ల అమరిక, కాలిపర్ శిబిరం నిర్వహించనున్నట్లు మంచ్ అధ్యక్షుడు బ్రిజ్ మోహన్ బూబ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలాజీ మందిర్‌లో నిర్వహించనున్న ఈశిబిరం రేపటి నుంచి బుధవారం వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా జైపూర్ కృత్రిమ కాళ్లు, పోలియో వ్యాధిగ్రస్తులకు కాలిపర్స్ అమర్చనున్నామన్నారు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలలో రోగి కాళ్లు సరిగా కనపడేలా ఫొటో, ఆధార్ కార్డు జిరాక్సుతో రావాలన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 9989495561, 9885934446 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని సయ్యద్‌పల్లిలో మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న అంబేడ్కర్ ప్రజా సంఘం సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని అంబేడ్కర్ ప్రజాసంఘం సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, డివిజన్ కార్యదర్శి వెంకటేశ్, సభ్యులు, వ్యాపారస్తులు లక్ష్మణ్, బాల్‌రాజు, రాజ్ పురోహిత్, తేజరామ్ చౌదరి, ప్రభురాం చౌదరి, నారాయణ లాల్ చౌదరి తదితరులు ఆయనను సన్మానించిన వారిలో ఉన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

అశోక్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు



వరల్డ్ బుక్ రికార్డు ధ్రువీకరణ పత్రంతో అశోక్

దౌల్తాబాద్: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రాకారుడు సున్నపు సూక్ష్మ చిత్రకళలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించాడు. ఇప్పటికే తన కుంచెతో ఎన్నో బొమ్మలను గీసిన ఆయన వృథా వస్తువులతో సూక్ష్మకళాకృతులను రూపొందించి ఔరా అనిపిస్తున్నాడు. తన ప్రతిభతో వరల్డ్ అచీవర్ రికార్డ్ ధ్రువీకరణ పత్రం అందుకున్నాడు. అమెరికా కేంద్రంగా కొనసాగుతున్న వరల్డ్ అచీవర్ బుక్ రికార్డ్స్ సంస్థ కొరియర్ ద్వారా తనకు సర్టిఫికెట్ పంపినట్లు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబసభ్యులు అతన్ని అభినందించారు.


పీసీబీ మెంబర్‌గా చింపుల సత్యనారాయణరెడ్డి



చేవెళ్ల: తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్‌గా సీఎస్ శాంతకుమారి వ్యవహరిస్తారని..ఇందులో మెంబర్లుగా రాష్ట్రంలోని పలు రంగాలకుచెందిన వారిని నియమించారని చెప్పారు. ఇందులో భాగంగా తనకు అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీతం రాదు | జీవనం సాగదు!

అసలే అరకొర జీతాలు.. ఇబ్బందులు పడుతూ ఇరవై ఏళ్లుగా నెట్టుకొస్తున్నా సకాలంలో వేతనాలు వేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి నాలుగు నెలలైనా అందక అప్పు పుట్టడం లేదంటూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రోడ్డెక్కుతామంటూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో వెట్టి బతుకులు

- నెలల తరబడి అందని వేతనాలు
- అప్పు ఇచ్చే వారులేక పూట గడవని దుస్థితి
- ప్రభుత్వాలు మారుతున్నా దొరకని పరిష్కారం

వికారాబాద్: ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న వేతన జీవులకు వెతలు తప్పడం లేదు. ఒక్కోసారి రెండు నుంచి నాలుగు నెలల ఆలస్యమవుతోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సమస్య మరింత జఠిలమైందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల వేతనాలు వారం రోజులు ఆలస్యమైనా ప్రభుత్వంపై మండిపడే సంఘాలు నోరు మెదపడం లేదు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ప్రభుత్వ ఉద్యోగులు వీరి గొంతు నొక్కేస్తున్నారు. ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డీఆర్డీఏలలో విధులు నిర్వర్తిస్తున్న వందలాది మంది ఉద్యోగులకు ఈ సమస్య కొరకరాని కొయ్యగా తయారైంది. వేతనాలు సమయానికి అందక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు. అప్పులు చేసి నెట్టుకు రావాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు.

హెల్త్, ఎడ్యుకేషన్, డీఆర్డీఏ ఉద్యోగుల అవస్థలు

విద్యాశాఖ, వైద్య శాఖ, డీఆర్డీఏ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ప్రతీ నెల రావడం లేదు.

- జిల్లా వైద్యారోగ్య శాఖలో సుమారు 800 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో డాక్టర్లు, ఏఎస్‌ఎంలు, జూనియర్ ఏఎస్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు తదితరులున్నారు.
- విద్యాశాఖలో 750 మంది కాంట్రాక్టు ఉద్యోగస్తులున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరాక ఒక నెల మాత్రమే వేతనాలు వచ్చాయి. మండల విద్యావనరుల కేంద్రాల్లో విధులు నిర్వర్తించే నాన్ టీచింగ్ స్టాఫ్, కేజీబీవీలో నాన్ టీచింగ్ స్టాఫ్ ఇందులో ఉన్నారు. సీఆర్పీలు, ఎంఐసీలు, పీటీఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు ప్రతీ నెల వేతనాలు అందని వారిలో ఉన్నారు.
- డీఆర్డీఏ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న 200 మంది ఉద్యోగులకు ఇదే ఇబ్బంది ఉంది. ఇందులో అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు తదితరులు వేతన వెతలు అనుభవిస్తున్నారు.

వేతనాలు అందక అప్పులపాలు

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రతీ నెల వేతనాలు అందక అప్పులు చేస్తున్నామంటున్నారు. ఓ వైపు ఉద్యోగాల క్రమబద్ధీకరణకు డిమాండ్ చేస్తుంటే.. ఇచ్చే వేతనాలు సైతం సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. కొన్ని సార్లు అప్పు పుట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. వేతనాల విడుదలలో తమపై వివక్ష చూపొద్దని కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రోడ్లపైకి వస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

అడ్రస్ లేని 'భారత్ రైస్'

పెరిగిన ధరలతో ప్రజలు పస్తులుండకుండా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకువస్తోంది. ఇప్పటికే భారత్ దాల్, భారత్ ఆట పేరిట నిత్యావసర సరుకులు అందజేస్తున్న సర్కారు రూ.29కి కిలో బియ్యం చొప్పున భారత్ రైస్ బ్రాండ్ పేరిట రాయితీపై అమ్మకాలను చేపడుతోంది. జిల్లాలో మాత్రం ఇప్పటికీ వీటి జాడ దొరకడం లేదు.

- రూ.29కేజీ చొప్పున విక్రయించాలని నిర్ణయం
- పథకం ప్రారంభించి పక్షం రోజులైనా జిల్లాలో కరువైన కేంద్రాలు
- రేషన్ దుకాణాల్లోనే విక్రయించాలని పేదల డిమాండ్



వికారాబాద్ అర్బన్: బహిరంగ మార్కెట్లో బియ్యం రకాలను బట్టి ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యులు సన్న బియ్యం కొనాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన కేంద్ర ప్రభుత్వం బియ్యం ధరలకు కళ్లెం వేయాలని భావించింది. 5 కేజీలు, 10 కేజీల బియ్యం బ్యాగులను రూ.29 కిలో చొప్పున విక్రయించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 7 నుంచి దేశ వ్యాప్తంగా అమ్మకాలు ప్రారంభించింది. పదిహేను రోజులు కావస్తున్నా జిల్లాలో మాత్రం భారత్ రైస్ విక్రయం జాడ లేదు. ఇందుకు సంబంధించిన వివరాలు సైతం సివిల్ సప్లై అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం.

15 రోజులైనా పురోగతి శూన్యం

జిల్లాలో మూడు పంటలు వరి వేస్తున్నా బియ్యం ధరలు మాత్రం దిగి రావడం లేదు. ఏడాదిలో మూడు దఫాలుగా వరి పంట సాగు అవుతున్నా బియ్యం ధరలు తగ్గడం లేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం నాణ్యతను బట్టి కిలో రూ. 50 నుండి రూ.80 వరకు లభిస్తున్నాయి. ఈ పరిస్థితి నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో కేంద్ర సర్కార్ కేవలం రూ.29కే కిలో బియ్యాన్ని విక్రయించేందుకు నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణ కరువైంది. ఈ పథకం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఎక్కడ విక్రయ కేంద్రాలు తెరుచుకోలేదు. భారత్ రైస్‌ను అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం నాఫెడ్(నేషనల్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీ ఐఎఫ్) కేంద్రీయ భండార్ రిటైల్ అవుట్‌లెట్‌లు, ఈ– కామర్స్ సంస్థలకు భారత్ రైస్ విక్రయ బాధ్యతలు అప్పగించింది. ఈ సంస్థలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించి లేక భారత్ రైస్ అందుబాటులోకి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ సంస్థలకు అనుబంధంగా విక్రయ కేంద్రాలు లేకపోవడంతో రాయితీపై సరఫరాచేస్తున్నా బియ్యం పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా భారత్ రైస్ విక్రయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడంతో రాయితీ బియ్యం అందడం లేదనే విమర్శలున్నాయి.

రేషన్ మాదిరిగానే..

భారత్ రైస్ ను ఈ-కామర్స్ ద్వారా అమ్మాలని తీసుకున్న నిర్ణయంపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. మారుమూల ప్రాంతంలో అందుబాటులో ఉండే చౌకధరల దుకాణాల ద్వారా భారత్ రైస్‌ను విక్రయిస్తే అందరికి మేలు చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే మారుమూల గ్రామాల్లో చౌకధర దుకాణాలు ఉండటంతో వాటిలో తెల్ల రేషన్ కార్డులున్న లబ్ధి దారులకు ఉచితంగా బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఇదే తరహాలో భారత్ రైస్‌ను పంపిణీ చేయాలని కోరుతున్నారు.



ఆ కార్యాలయంపై ఏసీబీ దృష్టి

కొందుర్గు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. పహాణీ, ఆర్ఓఆర్ పత్రాల కోసం ఓ ఆర్మీ జవాన్ నుంచి రూ.40వేలు తీసుకున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్ కావడం సంచలనం సృష్టించింది. తన భూమికి సంబంధించిన ఆర్ఓఆర్, పహాణీలు ఇవ్వాలని ఆర్మీ జవాన్ అశోక్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. సదరు పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే లక్ష రూపాయాలు ఖర్చవుతాయని, తమకు రూ.40 వేలు ఇస్తే నేరుగా ఇస్తామని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాల్‌రాజ్‌తోపాటు కార్యాలయంలో పని చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి హేమంత్ డబ్బులు తీసుకున్నారని అశోక్‌రెడ్డి సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియో ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై శనివారం తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుడు పోస్టు చేసిన వీడియో ఆధారంగా తాను నివేదిక రాసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే గెలుపు మనదే

చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే గెలుపు సులభమని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని మణి గార్డెన్‌లో శనివారం పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలు పునిచ్చారు. కరోనా మహమ్మారి నుంచి భారత దేశాన్ని కాపాడిన గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది తెలంగాణ కోసం, రంగారెడ్డి జిల్లా కోసమని స్పష్టం చేశారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ అబ్ కి బాత్ రాహుల్ సర్కార్ అనాలని సవాల్ విసిరారు. ఎంపీ స్థానాల్లో గెలిస్తే భవిష్యత్తు మొత్తం మనదే అని, స్థానిక సంస్థల్లోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్,అసెంబ్లీ ప్రభారి రాజవర్ధన్,స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణహత్య

- గొంతుకోసి హతమార్చిన దుండగులు



ఉస్మాన్ మృతదేహం

పహాడీషరీఫ్: ఓ రౌడీషీటర్‌ను గొంతుకోసి దారుణంగా హత్య చేసిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ మహ్మద్ ఉస్మాన్(36) ఏడాది నుంచి పహాడీషరీఫ్ ఉమర్ కాలనీలోని మీరాష అబూ అల్ కలాం దర్గాలో నివసిస్తూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఎప్పటిలాగే శనివారం మధ్యాహ్నం దర్గాలో ఉండగా పెద్ద ఎత్తున కేకలు వినిపించాయి. దీంతో దర్గా పక్కన ఉన్న స్థానికులు లోనికి వెళ్లి చూడగా ఉస్మాన్ గొంతు కోయబడి రక్తపు మడుగులో పడి ఉండడం.. ఇద్దరు దుండగులు అటుగా పారిపోతుండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఉస్మాన్ మృతి చెంది కనిపించాడు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువా రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. ఉస్మాన్‌ను తీవ్రంగా కొట్టి, గొంతు కోసినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. 2009–2011 మధ్య కాలంలో చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇతనిపై బెదిరింపులు, దోపిడీ, దాడి, హత్యాయత్నం లాంటి కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ఒక బృందాన్ని రంగంలోకి దింపినట్లు ఏసీపీ వెల్లడించారు.



గాజీపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి

'కారు'కు ఝలక్

- బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు

పెద్దేముల్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా కారు దిగుతున్నారు. శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డీవై నర్సింలు, అంజిల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, మాజీ సర్పంచ్‌లు ఇందూరు ప్రకాశం, మోహన్‌రెడ్డి, గెమ్యా, రాంచంద్రయ్య, లక్ష్మన్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌తో కలిసి రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పటిష్టతకు పనిచేసినా గుర్తింపు లేకపోవడంతోనే పార్టీని వీడుతున్నామన్నారు. తమ రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం తాండూరులో సమావేశం నిర్వహించినా తమకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. పదేళ్లు తమతో కలిసి పనిచేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ రెండు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్, తట్టిపల్లి, బండమీదిపల్లి, ఓంలానాయక్‌తండా, కందనెల్లి, మంబాపూర్, రుద్రారం, మారేపల్లితండా, సిద్దన్న మడుగుతండాతో పాటు పలు గ్రామాల నాయకులు ఆజం ఖాన్‌సాబ్, నల్లా వెంకటరెడ్డి, కుమ్మరి విఠల్, ఎర్ర రవి, మాన్‌సింగ్, రామారావ్, హన్మానాయక్, రామ్‌నాయక్, హజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


అలివేలు (ఫైల్‌)

తాండూరు రూరల్‌: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం... తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామానికి చెందిన శ్రీనివాస్‌, శిరీష దంపతులు.. వీరికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కారణంగా ఈనెల 5వ తేదీ మంగళవారం శిరీష ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు , తెలిసిన వారి వద్ద వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త శ్రీనివాస్‌ శనివారం కరన్‌కోట్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ఘటనలో..


శిరీష (ఫైల్‌)

కుల్కచర్ల: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన చౌడాపూర్‌ మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..చౌడాపూర్‌ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి అలివేలును గత 15సంవత్సరాల క్రితం పగిడ్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అనంతరం ఒక సంవత్సరం తర్వాత ఆమె మతిస్థిమితం కోల్పోవడంతో తిరిగి కొత్తపల్లి గ్రామంలో పుట్టింటిలో విడిచివెళ్లి పోయారు. అనంతరం ఆమె సోదరుడు కామారం వెంకటేశ్‌ ఇంటి వద్ద ఉంటూ జీవనం సాగించేది. కొన్ని రోజులు వేరే ప్రాంతానికి వెళ్లి మళ్లీ ఇంటికి వచ్చేది. కాగా, ఫిబ్రవరి 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

తాండూరు రూరల్‌: మండలంలోని సంగెంకలాన్‌లో పేకాటరాయుళ్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. సంగెంకలాన్‌కు చెందిన కొందరు గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయం వద్ద పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పూడూరు: అతివేగంగా సిమెంట్‌ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో కారుడ్రైవర్‌ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల పరిధిలోని సోమన్‌గుర్తి గేటు సమీపంలో కారు నడుపుతున్న డ్రైవర్‌ విజయ్‌శేఖర్‌ ఎదురుగా వస్తున్న సిమెంట్‌ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

వాసవి క్లబ్‌ రీజియన్‌ చైర్మన్‌ బాల రాజేశ్‌

షాద్‌నగర్‌ రూరల్‌: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని వాసవిక్లబ్‌ రీజియన్‌ చైర్మన్‌ బాల రాజేశ్‌ పేర్కొన్నారు. శనివారం రామేశ్వరంలో వాసవి, వనితా క్లబ్‌ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బాలరాజేశ్‌ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్‌ అధ్యక్షుడు గుడిపల్లివెంకటరమణ, వనితాక్లబ్‌ అధ్యక్షురాలు కొండ రమ, కార్యదర్శులు సురేశ్‌కుమార్‌, కల్వ పుష్పాంజలి, కోశాధికారులు కల్వ మాణిక్యం, పాపిశెట్టి స్వప్న, డిస్ట్రిక్‌ గవర్నర్‌ నర్సింహ్మగుప్తా, సెక్రటరీ వాడకట్టు విజయకుమార్‌, వెంకటరమణ, ఉప్పల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కరెంట్‌ బిల్లులు కట్టాల్సిందే

- ఎలక్షన్‌ కోడ్‌ ఎఫెక్ట్‌
- జిల్లాకు గృహజ్యోతి పథకం దూరం



కుల్కచర్ల: అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్‌ పార్టీ నిరుపేదలకు 'గృహజ్యోతి పథకం 'తో ఉచితంగా కరెంట్‌ ఇస్తామని చెప్పింది. హామీ అమలు దిశగా కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ పథకం గ్రామీణ ప్రాంతాలకు అందని పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి నెలలో మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్‌ సిలిండర్‌ను రూ.500కే అందించడంతో పాటుగా 200 యూనిట్స్‌ ఉన్న కరెంట్‌ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదంటూ గృహజ్యోతి పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు.

ఎలక్షన్‌ కోడ్‌ ఎఫెక్ట్‌

200 యూనిట్ల లోపు కరెంటు వాడిన కుటుంబాలకు జీరో బిల్లులు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం వారు వినియోగించిన యూనిట్లకు బిల్లు వచ్చింది. మహబూబ్‌నగర్‌ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్‌ వెలువడటంతో కరెంటు బిల్లులు యథావిధిగా వచ్చాయి. ఎన్నికల కోడ్‌ ముగిసే వరకు కరెంట్‌ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాల పునఃవిభజన సమయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఉండే మండలాలను వికారాబాద్‌, రంగారెడ్డి జిల్లాలో కలిపారు. దీంతో ఎలక్షన్‌ కోడ్‌ మహబూబ్‌నగర్‌ ఉమ్మడి జిల్లాలో కలిపిన మండలాలకు సైతం ఎలక్షన్‌ కోడ్‌ వర్తిస్తుంది. దీంతో కొత్తగా అమలు చేసిన సంక్షేమ పథకాలు జిల్లాలోని మండలాలకు అందని పరిస్థితి నెలకొంది.

ఎంపీ ఎలక్షన్‌ కోడ్‌.. మరో బిల్లుకట్టాల్సిందేనా ?

ప్రస్తుతం మహబూబ్‌నగర్‌ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గృహజ్యోతి పథకానికి బ్రేకులు పడినప్పటికీ, ఇది ఇలాగే మరొక మూడు నెలల కాలం కొనసాగే పరిస్థితి కనిపిస్తుంది. ఈ నెలలోనే పార్లమెంట్‌ ఎన్నికలకు నోటిఫికేషన్‌ వెలువడుతుంది. దీంతో ఎంపీ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మారే పరిస్థితి.

బిల్లులు కట్టమంటున్నారు..


– వెంకటేశ్‌, కుల్కచర్ల

కరెంటు ఉచితంగా ఇస్తామని చెప్పి అన్ని పత్రాలు తీసుకున్నారు. 200యూనిట్ల లోపు బిల్లులు అన్ని ఫ్రీ అని చెప్పి ఇప్పుడేమో బిల్లులు కట్టాల్సిందేనని చెబుతున్నారు. కట్టకుంటే తర్వాత ఫ్రీ కరెంట్‌ రాదు.. మేమేమీ చేయలేమని అంటున్నారు.

కోడ్‌ వల్ల బిల్లులు ఇస్తున్నాం..


– హైమద్‌, ట్రాన్స్‌కో ఏఈ, కుల్కచర్ల

మహబూబ్‌నగర్‌ ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం వినియోగదారులకు కరెంటు బిల్లులు ఇస్తున్నాం.. వాడిన యూనిట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా అధికారుల ఆదేశాలు ఏవిధంగా వస్తే వాటిని అనుసరిస్తూ బిల్లులు ప్రక్రియను కొనసాగిస్తాం.


పోలీసులతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పోలీసులకు సహకరించాలి

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

దోమ: సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇండో టిబెటన్‌ బార్డర్‌ పోలీస్‌ (ఐటీబీపీ, కేంద్ర బలగాలు) సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణసాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడంతో పాటు ఎలాంటి అలర్లు జరకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కవాతు నిర్వహించామన్నారు. మండలంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌, ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌, ఏఎస్‌ఐ సూర్యనారాయణ, పోలీస్‌, ఐటీబీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

తాండూరు టౌన్‌: అక్రమ మద్యం తరలింపు కేసులో సీజ్‌ చేసిన ఐదు వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు తాండూరు ఎక్సైజ్‌ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటలకు స్థానిక ఎక్సైజ్‌ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో హీరో డీలక్స్‌, హోండా ఆక్టివా, బజాజ్‌ ఆటోలను వేలంలో విక్రయిస్తామన్నారు. అలాగే, హీరో స్పె లండర్‌ ప్లస్‌, బజాజ్‌ సిటి 100 బైకులను స్క్రాప్‌గా విక్రయిస్తామన్నారు. కావునా, అవసరమైన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

బీజేపీలో వర్గపోరు

వర్గపోరును బహిర్గతం చేసిన ఫ్లెక్సీలు



వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

కుల్కచర్ల: పార్లమెంట్‌ ఎన్నికల వేళ బీజేపీలో వర్గపోరు బహిర్గతమైంది. పరిగి నియోజకవర్గ నేతల మధ్య సమన్వయం లోపించడంతో ఎవరికి వారు పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, పాంబండ దేవస్థాన పరిధిలో కొందరు బీజేపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో మండల అధ్యక్ష కార్యదర్శుల ఫొటోలు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, మరి కొంతమంది నేతల ఫొటోలు లేవు. ప్రోటోకాల్‌ పాటించకుండా వేశారని స్థానికులు కొందరు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌ కొనసాగుతున్న వేళ ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారంటూ వారే అధికారులకు ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది. ఫిర్యాదు నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సిని తొలగించారు. స్థానిక బీజేపీలో మారుతికిరణ్‌, మిట్టాపరమేశ్వర్‌ రెడ్డి వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్న పరిస్థితి. అలాగే, కొత్తగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప వ్యక్తిగత కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో ఎవరి వెంట వెళ్లాలో కార్యకర్తలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది.

బస్టాండ్‌ లేక పాట్లు!

- మండలం ఏర్పడిన మంజూరు కాని వైనం
- చిన్న షెల్టర్‌తోనే సరిపెడుతున్న ఆర్టీసీ


కోట్‌పల్లి మండల కేంద్రంలోని చిన్న పాటి బస్‌ షెల్టర్‌

బంట్వారం: బస్టాండ్‌ లేక కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రయాణికులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. 20 ఏళ్ల కిందట కట్టించిన చిన్న బస్‌షెల్టరే దిక్కయింది. అయినా, ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చాలా మంది హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నమని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

సంత రోజు రద్దీ ఎక్కువ..

కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. దీంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు, ,కూరగాయల కోసం కోట్‌పల్లికి వస్తుంటారు. బస్‌షెల్టర్‌ పక్కనే సంత జరగడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రైవేటు వాహనాలు బస్‌షెల్టర్‌కు ఎదురుగానే నిలిపి ఉంచుతున్నారు. చిరు వ్యాపారులు కూడా తోపుడు బండ్లను అక్కడే పెడుతున్నారు. బస్సులు వస్తే షెల్టర్‌లో కూర్చున్న ప్రయాణికులు త్వరగా వెళ్ల లేకపోతున్నారు.

కొత్తగా ఏర్పడిన మండలం..

కోట్‌పల్లి మండలం కొత్తగా ఏర్పడిన ఇప్పటివరకూ బస్టాండ్‌ నిర్మాణం ఊసేలేదు. ఆర్టీసీ అధికారులు కనీసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. చాలా మంది బస్సుల్లోనే వస్తుంటారు. తాండూరు ,వికారాబాద్‌ ,సంగారెడ్డి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కోట్‌పల్లికి వచ్చిపోతుంటాయి. ప్రతి రోజు వందలాది మంది వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచే ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వం స్పందించి బస్టాండ్‌ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

మానవత్వం చాటిన నాయకులు

మతిస్థిమితం లేని యువకుడికి సపర్యలు


మతిస్థిమితం లేని యువకుడితో నాయకులు ,ఎస్‌ఐ వరప్రసాద్‌

కడ్తాల్‌: గత రెండు నెలలుగా మండల కేంద్రంలో ఓ మతిస్థిమితం లేని యువకుడు శ్రీశైలం– హైదరాబాద్‌ జాతీయ రహదారిపై అటు, ఇటు తిరుగుతూ రోడ్డు పక్కన నివాస గృహాల వారు పెట్టే భోజనం తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఎవరైనా పలకరిస్తే ఒకటి రెండు మాటలు హిందీలో మాట్లాడుతూ.. ఎక్కడి నుంచి వచ్చావు, నీ పేరేంటి, మీ తల్లిదండ్రులు ఎవరూ అంటే, మేరానామ్‌ మోహిత్‌, కల్యాన్‌పూర్‌ అంటూ అమాయకంగా చూస్తుండిపోతున్నాడు. యువకుడి దీనస్థితిని చూసి చలించిపోయిన కడ్తాల్‌ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ ఆంజనేయులు, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌లు శనివారం ఉదయం మతిస్థిమితం లేని యువకుడికి అండగా నిలిచారు. ఈ మేరకు అతడికి క్షవరం చేయించి, స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగి కడుపు నిండా భోజనం పెట్టించారు. అనంతరం స్థానిక ఎస్‌ఐ వరప్రసాద్‌ను కలిసి యువకుడి పరిస్థితిని వివరించారు. దీంతో ఎస్‌ఐ యువకుడి వివరాలు బీహార్‌లోని కల్యాణ్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌ చేసి, వాట్సాప్‌ ద్వారా ఫొటోలు పంపించాడు. అనంతరం సీఐ శివప్రసాద్‌ ఆదేశాల మేరకు పోలీస్‌ సిబ్బంది హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌ ఆనాథాశ్రమానికి యువకుడిని తరలించారు. దీంతో స్థానికలు నాయకులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, రాజేందర్‌గౌడ్‌, వీరరాఘవులు ఉన్నారు.

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య


సూరజ్‌లాల్‌ మృతదేహం

పహాడీషరీఫ్‌: భార్యతో గొడవపడి వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జ్యోతి, సూరజ్‌లాల్‌(21) పది రోజుల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి నర్సరీలో పని చేస్తున్నారు. రెండు రోజుల నుంచి సూరజ్‌లాల్‌ మద్యం సేవించి రావడాన్ని గమనించిన జ్యోతి శుక్రవారం రాత్రి ఎందుకు తాగొచ్చావంటూ నిలదీసింది. దీంతో సూరజ్‌లాల్‌ ఆమెను కొట్టడంతో పాటు గదిలో నుంచి బయటకు గెంటి లోపల నుంచి డోరు పెట్టుకున్నాడు. పక్కనే ఉండే జ్యోతి సోదరి వచ్చి, గొడవ విషయం రేపు మాట్లాడుదామంటూ తన ఇంటికి తీసుకెళ్లింది. శనివారం ఉదయం జ్యోతి ఇంటికి వచ్చి తలుపులు తట్టగా సూరజ్‌ డోర్‌ తెరవలేదు. కిటికిలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


నాజియా ఫాతిమా(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: యువతి అదృశ్యమైన ఘటన శనివారం బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన సయ్యద్‌ అహ్మద్‌, ఫరీదా దంపతుల కుమార్తె నాజియా ఫాతిమా(19), అప్పుడప్పుడు ఆమె షాహీన్‌నగర్‌లో ఉంటే పెద్దమ్మ షాహీన్‌ ఉన్నీసా ఇంటికి వెళ్లి వస్తూ ఉండేది. ఈ క్రమంలోనే పెద్దమ్మ ఇంటి ఎదురుగా ఉన్న షేక్‌ సొహేల్‌తో మాట్లాడుతుందన్న విషయం తెలుసుకున్న ఫరీదా బేగం పలుమార్లు మందలించింది. వారం రోజుల నుంచి పెద్దమ్మ ఇంటి వద్దే ఉన్న ఫాతిమా ఈ నెల 8న ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న తల్లి స్థానికంగా వెతికినా ఫలితం లేకపోవడంతో, సొహేల్‌పైనే అనుమానం ఉందంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


తాండూరు రూరల్‌: భూకైలాస్‌లో భక్తులు


నీటిమార్గం ద్వారా వెళ్తున్న భక్తులు

నేటితో ముగియనున్న ఉత్సవాలు

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని అంతారం తండాలో ద్వాదశి జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా శనివారం భూకైలాస్‌లో శివపార్వతులను పల్లకీలో ఊరేగించారు. ఊరేగింపు ముందు కర్ణాటకకు చెందిన స్వాములు ప్రత్యేక భజనలు, విద్యార్థులు కోలాటాలు అలరించాయి. అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నీటిమార్గం ద్వారా శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు శంకర్‌నాయక్‌, వాసుపవార్‌ నాయక్‌, మాజీ సర్పంచు రాంచందర్‌లు ఉన్నారు.

వేడుకగా కాశీవిశ్వనాథుడి కల్యాణం


కడ్తాల్‌: మైసిగండిలో శివపార్వతుల కళ్యాణోత్సవ వేడుక

కడ్తాల్‌: మండలం పరిధిలోని మైసిగండి గ్రామంలోని కొలువైయున్న కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆలయంలో ఏకదశ కలశాభిషేకం, వసంతోత్సవం, అవబృతం, పూర్ణాహుతి నిర్వహించారు. శుక్రవారం అర్థరాత్రి లింగోద్భవకాలంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం భక్తజన సందోహం మధ్య వైభవంగా చేశారు. అనంతరం శనివారం తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్‌ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్‌ జ్యోతి ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్‌, అరుణ్‌కుమార్‌, ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్‌


నిందితుడు అభిషేక్‌కుమార్‌ (ఫైల్‌)

మొయినాబాద్‌: ఇద్దరు వ్యక్తులు గొడవపడి కర్రతో తలపై కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్‌ మండలంలోని ఎనికేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎస్‌ రాజుసింగ్‌(32), మణికొండలో డాక్టర్‌ శ్రీనివాసులు వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5న రాత్రి ఇంట్లో పనిచేసే హనుమంతు, అభిషేక్‌లతో కలిసి డాక్టర్‌ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను వాహనంలో మొయినాబాద్‌ మండల పరిధిలోని ఎనికేపల్లి శివారుల్లో ఉన్న ఫాంహౌస్‌కు తీసుకొచ్చారు. సామాన్లు దింపిన అనంతరం రాజుసింగ్‌, అభిషేక్‌ బయటకు వెళ్లి మద్యం తాగి గొడవపడ్డారు. రాజుసింగ్‌ వంట చేస్తుండగా అభిషేక్‌ చెక్క కర్ర తీసుకొని వచ్చి తలపై కొట్టాడు. దీంతో తల పగిలి తీవ్రగాయాలయిన రాజుసింగ్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్‌ఓటీ పోలీసుల సహాయంతో నిందితుడు అభిషేక్‌కుమార్‌ గోండ్‌ అలియాస్‌ రాహుల్‌ను శుక్రవారం రాత్రి పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం


భజనలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నెహ్రూ యువ కేంద్రం, ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని మినీస్టేడియంలో మహిళలకు పరుగు పందెం నిర్వహించారు. ఈ పోటీలను సీడీపీఓ నాగమణి, సీనియర్‌ న్యాయవాది సబియా సుల్తానా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళ అని, సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. మహిళలు వంటింటికి పరిమితం కావొద్దన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, క్రీడా రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానంతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెమినా మహిళా మండలి నిర్వాహకురాలు అలియా సుల్తానా పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతుడు నరేష్‌ (ఫైల్‌)

మొయినాబాద్‌: అదృశ్యమైన వ్యక్తి గండిపేట చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం వెలుగు చూసింది. మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన కాడిగళ్ల నరేష్‌(30)గత కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో మూడేళ్ల నుంచి భార్య దూరంగా ఉంటుంది. గత పది రోజుల నుంచి నరేష్‌ ఊళ్లో కనిపించకుండా పోయాడు. శనివారం మధ్యాహ్నం చిలుకూరు సమీపంలో ఉన్న గండిపేట చెరువులో నరేష్‌ మృతదేహం కుళ్లిన దశలో కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికి తీశారు. నరేష్‌ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

మృతుడిపై కేసు నమోదు..

మృతుడు నరేష్‌పై పదిహేను రోజుల క్రితం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. నరేష్‌ తన వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, చేయిపట్టి లాగాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచే పరారీలో ఉన్న నరేష్‌ చెరువులో శవమై తేలడంపై పలు అనుమానాలకు తావిస్తుంది.

ప్రేమపేరుతో అఘాయిత్యం

- గర్భందాల్చిన బాలిక
- నిందితుడికి రిమాండ్‌


నిందితుడు శేఖర్‌

మీర్‌పేట: ప్రేమపేరుతో ఓ యువకుడు.. బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన శేఖర్‌ (28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ.. మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధిలోని జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఇంటర్‌ చదువుతున్న బాలిక (17)కు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి.. పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఆతర్వాత శేఖర్‌కు వివాహమై, ఇద్దరు పిల్లలున్న విషయాన్ని తెలుసుకుని అతడిని నిలదీయగా.. బాలికతో బలవంతంగా గర్భనిరోధక మాత్రలు మింగించాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై అస్వస్థతకు గురైన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు ఈ నెల 7న మీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌లో శేఖర్‌పై కేసు నమోదు చేసి, శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ కాశీవిశ్వనాథ్‌ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే సత్ఫలితాలు


విజయలక్ష్మిని సన్మానిస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌ రూరల్‌: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే సత్ఫలితాలను సాధిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాగులపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో బేరా సొసైటీ, లయన్స్‌క్లబ్‌, భవానీ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చన్నారు. విద్యను నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం సాధనచేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. బేరా సొసైటీ చైర్మన్‌, లయన్స్‌క్లబ్‌ సభ్యుడు డాక్టర్‌ రెడ్యానాయక్‌, పాఠశాల ప్రిన్సిపాల్‌ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.